# విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి...

- కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి...
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు...

**విశాలాంధ్ర-ఆమదాలవలస :** విద్యార్థుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడప స్టీల్ ప్లాంట్ తక్షణమే నిర్మాణం చేపట్టాలని కోరుతూ నవంబర్-8న విద్యాసంస్థల రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు నిర్ణయించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు అధ్యకతన జరిగింది. కార్యక్రమంలో సిటిజన్ ఫోరం నాయకులు బొడ్డేపల్లి మోహన్‌రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బోర గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజిరావు, జనసేన పార్టీ నాయకులు పైడి మురళిమోహన్‌లు మాట్లాడుతూ త్యాగాల పునాదుల పైన నిర్మించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటువరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం చారిత్రాత్మక తప్పిదమని వారు అన్నారు. శుక్రవారం ఆమదాలవలస నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 32 మంది విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయారన్నారు. భూములను స్టీల్ ప్లాంట్‌కు స్వచ్ఛందంగా అప్పగించారని, బలిదానాలకు, త్యాగాలకు విలువ ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం కొమ్ముకాసే కార్పొరేట్ కంపెనీల కోసం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి ప్రయత్నించడం భారతదేశ జాతి ప్రయోజనాలను నిర్వీర్యం చేసే దిశగా కొనసాగుతుందని, వెంటనే స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ కరణ ను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని లేనియెడల ఆనాడు విద్యార్థులు యువత పోరాటం చేసి ఏవిధంగా స్టీల్ ప్లాంట్ ను కాపాడుకున్నారో ఆ పోరాటాల ఆధారంగానే ముందుకు కొనసాగుతామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కుర్మయ్య, సింహాచలం, విజయ్ జనసేన నాయకులు నాగేంద్ర కుమార్, బాలమురళి, ప్రసాద్ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

- మార్పులు, చేర్పులకు డిసెంబర్ 9 వరకూ అవకాశం
- అన్ని వర్గాలు సమన్వయంతో సహకరించాలి : కలెక్టర్

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో జిల్లాలో 8 నియోజకవర్గాలకు గాను 18,27,143 మంది ఓటర్లున్నారని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల డ్రాఫ్ట్ రోల్ (ముసాయిదా జాబితా)ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీ వరకూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు నేటి నుంచి మొత్తం 45 రోజల పాటు అవకాశం కల్పిస్తున్నామన్నారు. అన్ని వర్గాలు సహకరించాలని ఆయన కోరారు. ఫిర్యాదుల కోసం నవంబర్ 4,5 అలాగే డిసెంబర్ 2, 3వ తేదీలలో ఆయా పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవెల్ అధికారులతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 12వ తేదీ వరకూ వచ్చిన ఫిర్యాదులు పరిశీలన పూర్తి చేసి, డిసెంబర్ 26వ తేదీ నాటికి వాటిని పరిష్కరించి జనవరి 1వ తేదీ నుంచి చివిర దశ పరిశీలన పూర్తయిన అనంతరం చివరిగా ఎలక్ట్రోల్ పబ్లికేషన్ ను వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన చేపడతామని పేర్కొన్నారు. పలు అభ్యర్ధనల మేరకు చనిపోయిన ఓట్ల తొలగింపు, స్థానికంగా నివాసం లేకపోవడం తదితర క్లెయిన ములను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ సారి 96వేల మంది ఓట్లను తొలగించినట్లు పేర్కొన్నారు. మొత్తంగా ఓటర్లలో 9,08,440 మంది పురుష ఓటర్లు, 9,18,528 మహిళా ఓటర్లున్నారని, వీరి కోసం 2357 పోలి ంగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ప్రతీ 1000 మంది జనాభాలో 758 మంది ఓటర్లున్నారని, సర్వీసు ఓటర్ల సంఖ్య 16,162గా ఉందని చెప్పారు. డిఫెన్సు, ఇతర కేంద్ర సర్వీసుల్లో ఉన్న సర్వీసు ఓటర్లు ఎక్కువగా ఉన్న జిల్లాగా శ్రీకాకుళం రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ఓటర్లుగా జిల్లాలో 18, 19 ఏం డ్ల మధ్య 50వేల మంది వరకూ నూతన ఓటర్లుగా నమోదు కావాల్సి ఉన్నదని అంచనా వేయగా, 20వేల మంది మాత్రమే నమోదు చేసుకున్నారని, త్వరలోనే ఇందుకుగాను ప్రత్యేక క్యాంపెయిన్ చేపడతామన్నారు. ఫైనల్ రోల్‌ను మదర్‌రోల్‌గా పరిగణిస్తామని, జనవరి తర్వాత ఓటర్లుగా నమోదయ్యే వారిని సప్లిమెంట రీరోల్లో పొందుపరుస్తామని వివరించారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు పొందేలా బిఎల్వో ఎ స్థాయి నుంచి చర్యలు చేపడతామని, దీని కోసం అన్నివర్గాలు సమన్వయంతో సహకరించాలని, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరిస్తామన్నారు. బిఎల్వోస్థాయి నుంచి ఎఈఆర్వో, ఈఆర్వో స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి వ్యక్తిగతంగా ఐదు కంటే ఎక్కువ ఫిర్యాదులను అంగీకరించబోమని స్పష్టం చేశారు.

**- ఓటు హక్కు తెలుసుకునేదెలా...** ఓటర్లు తమకు ఓటు హక్కు ఉన్నదీ లేనిది తెలుసుకునేందుకు బూత్ లెవెల్ ఏజెంట్లను సంప్రదించాలన్నారు. ఈసిఐ వెబ్సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఓటర్స్, ఈసిఐ.జీవోవి.ఇన్ ద్వారా కూడా సమాచారాన్ని తెలుసుకోవచ్చని, లేదా ఓటర్ హెల్ప్ లైన్ (విహెచ్ఎ) అనే యాప్ను డౌన్లోడ్ చేసుకుని ఓటు వివరాలను తెలుసుకోవచ్చ న్నారు. అలాగే టోల్ ఫ్రీ నెంబరు 1950 ద్వారా కూడా సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఒకవేళ పేరు లేకపోయినా ఫారం-6ను సమర్పించడం ద్వారా ఓటు హక్కును పొందవచ్చని కలెక్టర్ స్పష్టం చేసారు. విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్వో ఎం. గణపతిరావు ఉన్నారు.

# మత్తు ఔషధాలను పిల్లలకు విక్రయిస్తే కఠిన చర్యలు

- ఎస్సిపిసీఆర్ సభ్యులు గొందు సీతారాం

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** వైద్యుల సిఫారసులు లేకుండా పిల్లలకు ఎటువంటి మత్తు ఔషధాలను విక్రయించినా అటువంటి ఔషధ దుఖానాలుపైన, వ్యక్తులపైన కఠిన చర్యలకు రాష్ట్ర, జిల్లా అధికారులకు సిఫారసులు చేయనున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షన కమిషన్ (ఎస్సిపిసిఆర్)సభ్యులు గొందు సీతారాం అన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు మేరకు శుక్రవారం డగ్లస్ స్కూల్ దరిలో గల జిల్లా ఔషద నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వారి కార్యాలయంలో జిల్లాలోని బాలలకు మత్తు ఔషధాల విక్రయ నియంత్రణలో అధికారులు, ఔషద దుకాణాలు యజమానుల పాత్రపై దుఖానదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం మాట్లాడుతూ పెద్దలు తోడు లేకుండా, పిల్లలు నేరుగా వైద్యుల సిఫారసు చీటీలు లేకుండా మందుల దుకాణాలకు కొస్తే కోరెక్స్ వంటి దగ్గు మందులు ఆల్ప్రోజోలం 0.25, 0.5 ఎం.జి, బెంజోడియ జెపినిస్, డయాజెపం, నైట్రాజెపం, ఆల్ప్రెక్స్ 0.25,ె ంస్టిల్ 0.5 వంటి మందులే కాకుండా ఒపియోయిడ్స్, మోర్ఫైన్, కోడైన్, ఫెంటాలైనేటిక్ వంటి మత్తు ఇంజెక్షన్లు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించడం చట్ట విరుద్ధమన్నారు. అంతే కాకుండా నూటికి నూరు శాతం బాలల మానసిక ఆరోగ్యాలతో ఆట్లాడ డమే అవుతుందని అన్నారు,. ఇటువంటి అమ్మకాలు జరిపే ఔషద దుఖానాలుపై ప్రత్యేక దృష్టి నిలపడంతో పాటు ప్రత్యేక నిఘాను తీవ్రతరం చేయాలని అన్ని జిల్లాల పోలీసు ఎస్పీలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని అన్నారు. అలాగే పిల్లలకు ఇటువంటి మందులు విక్రయాలు జరపబోమని ఆయా షాపులు యజమానులు స్పష్టంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు ఉల్లంఘించి బాలలకు మత్తు ఔషధాలు అమ్మకాలు జరుపుతున్నట్టు పౌర సమాజం దృష్టికొస్తే (ఏపీఎస్‌-సీపీసీఆర్2018ఎట్.జీమెయిల్‌డాట్‌కాం) కు ఫిర్యాదులు చేస్తే తక్షణమే స్పందించి చట్ట ప్రకార చర్యలతో పాటు క్రిమినల్ చర్యలుకు సిఫారసులు చేస్తామని అన్నారు. జిల్లా ఔషద నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రరావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం సూచించిన ప్రతీ అంశాన్ని జిల్లాలోని అన్ని మెడికల్ షాపులు యజమానులు దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా బాలలకు మత్తు ఔషధాలు అమ్మకాలు జరపబోమని ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయిస్తామని అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సూచనలు శత శాతం పాటించి ఆరోగ్యవంతమైన బాలల శ్రీకాకుళం జిల్లాగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎస్.యుగంధర్ రావు, శ్రీకాకుళం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు గన్నెప్పదు, జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కరుణ కుమార్ గుప్త, గౌరవ ప్రధాన కార్యదర్శి వి.మణి రాజు, ట్రెజరర్ కే.మురళి కృష్ణ, నగరానికి చెందిన ఔషధ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

# సచివాలయాలకు సోలార్ విద్యుత్ ప్యానెల్స్

**విశాలాంధ్ర-శ్రీకాకుళం :** జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ను యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్ శుక్రవారం కలిశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో (సిఎస్ఆర్ ఆక్టివిటీలో) భాగంగా శ్రీకాకుళం జిల్లాలో పది సచివాలయాలకు సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఇవ్వడం జరిగింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్ ఆక్టివిటీలో) ఆక్టివ్ గా పార్టిసిపేట్ చేస్తున్నందుకు కలెక్టర్ యూనియన్ బ్యాంక్ వారిని అభినందించారు. రాబోయే కాలంలో మరిన్ని సిఎస్ఆర్ ఆక్టివిటీస్ లో పాల్గొని శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ శ్రీకేష్ ఆశాభవం వ్యక్తం చేశారు. ఇందులో శ్రీకాకుళం లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.సూర్య కిరణ్, యూనియన్ బ్యాంక్ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ కె. తేజేశ్వర్రావు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ కోనేరును అభివృద్ధి చేస్తాం

పలాస మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

**విశాలాంధ్ర-పలాస :** పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో గల ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్కు)ను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్‌తో కలిసి ముత్యాలమ్మ కోనేరు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కోనేరుపై అనేక ఆరోపణలు వచ్చాయని, దీనిపై స్పందించి పరిశీలించడం జరిగిందన్నారు. తన హయాంలో ముత్యాలమ్మకోనేరు పార్కును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. అలాగే కె.టి రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డి.ఇ సునీల్‌కుమార్, కాంట్రాక్టర్ మొదలవలస మన్మధరావు, కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌లు పాల్గొన్నారు.

# రైఫిల్ షూటింగ్ పోటీలకు చేతన్, రశ్మితలు ఎంపిక

**విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం :** రాజమండ్రిలో ఈనెల 29, 30 తేదీలలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న శ్రీకాకుళం న్యూ సెంట్రల్ స్కూల్ కి చెందిన విద్యార్థి శిష్టు లక్ష్మీ చేతన్, ఇలిసిపురం అర్సీఎం స్కూలుకు చెందిన పి రశ్మిత కృష్ణ రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరగనున్న పోటీలకు హాజరు కానున్నారు. చిత్తరంజన్ వీధిలోని మాతృదేవోభవ రైఫిల్ షూటింగ్ ఇన్స్టిట్యూట్ కి చెందిన విద్యార్థులిద్దరూ ఈ పోటీలకు ఎంపిక కావడం పట్ల శిక్షకుడు పి. తిరుమల హరీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో రైఫిల్, పిస్టల్ షూటింగ్ కు ఇప్పుడిప్పుడే ఆదరణ కనిపిస్తోందని చెప్పారు. భారత రక్షణ రంగంలోని నేవి, ఎయిర్ ఫోర్స్, కోస్ట్ గార్డు, ఇంకా అనేక ప్రభుత్వ ఉద్యోగాలలో షూటింగ్లో పతకాలు సాధించిన విద్యార్థులకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పారు. జిల్లా నుంచి జాతీయస్థాయి వరకు గత పదేళ్లలో ఎంతోమంది వివిధ స్థాయి పోటీలకు వెళ్లారని హరీష్ కుమార్ పేర్కొన్నారు. రైఫిల్ పోటీలకు వెళ్ళనున్న చేతన్, రశ్మితలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి బివి రమణ, ఒలింపికక్ అసోసియేషన్స్ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, న్యూ సెంటర్ స్కూల్ ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్ పి శ్రీకాంత్, షూటింగ్ కోచ్ రామ్మోహన్, తదితరులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో షూటింగ్లో జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# టీడీపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

ఎంపీ రామ్మోహనాయుడు

**విశాలాంధ్ర-మందస :** తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని శ్రీకాకుళం ఎం.పి కింజరాపు రామ్మోహనాయుడు అన్నారు. శుక్రవారం మండలం భిన్నల మదనాపురం గ్రామంలో పలాస నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జీ గౌతు శిరీషా ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఎం.పి రామ్మోహనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు తెలుగుదేశం పార్టీకి అతి ముఖ్యమని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుందని, పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంతో సమన్వయంతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు చెందిన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎండిన పంట పొలాలను నాయకులు పరిశీలన

**విశాలాంధ్ర-సంతబొమ్మాళి :** సంతబొమ్మాళి మండలం నౌపడ, సెలగపేట, చిన్న మర్రిపాడు, పెద్ద మర్రిపాడు, భావనపాడు ప్రాంతాల్లో వర్షాలు పడక పాడైపోయిన పంట పొలాలను మండల జడ్పీటీసీ సభ్యులు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అప్పారావు వైస్ ఎంపీపీ నక్క చింతామణి భీమరావు స్వామి, నౌపడ సర్పంచ్, పిఎసిఎస్ డైరెక్టర్ పిలక బృంద వికుమార్ రెడ్డి, భావనపాడు సర్పంచ్ బుద్ద మోహన్ రెడ్డి,, మండల సచివాలయ కన్వీనర్‌ల సంఘం అధ్యక్షుడు మోడీ భాస్కర్‌రెడ్డిలు శుక్రవారం పరిశీలించారు. వీరితపాటు దండుగోపాలపురం పంచాయితీ సర్పంచ్ ప్రతినిధి, పీఏసిఎస్ డైరెక్టర్ మార్పు నాగభూషన్, నౌపడ ఎంపీటీసీ బి.సుధ, ఎంపీటీసీ అంగ అప్పారావు, ,రెయ్యి ఆనంద్ వున్నారు, సుమారుగా 1030 ఎకరాలు పంటపొలాలు పాడైపోయినట్లు రైతులు నాయుకులు కు తెలిపారు. ఈ విషియాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని నాయుకులు రైతులకు హామీ ఇచ్చారు.

# జీఆర్‌పి కార్యాలయంలో ఓపెన్ హౌస్

**విశాలాంధ్ర-కాశీబుగ్గ :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పలాస ప్రభుత్వ రైల్వే పోలీసు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పలాస మేధా ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసుల పని తీరు, రికార్డులు, ఆయుదాల ఉపయోగంపై జీఆర్‌పి ఎస్.హెచ్.వో హెచ్.కె షరీఫ్ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్.సి కోదండరావు, కానిస్టేబుల్స్ మురళీ, శ్రీను, దేవేంద్ర, నవీన్, తేజలు పాల్గొన్నారు.

# కొవ్వాడ ప్రాజెక్టు ప్రత్యేక ఉప కలెక్టర్‌గా బి.పద్మావతి

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (కొవ్వాడ ప్రాజెక్ట్) ప్రత్యేక ఉప కలెక్టర్‌గా బి.పద్మావతి నియమితులయ్యారు. ఆమె శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

# ఇంటింటికి కుళాయి మంజూరు

**విశాలాంధ్ర-కొత్తూరు :** మండలం మెట్టూరు బిట్-2 పంచాయితీ పరిధిలో ని సోలిపి గిరిజన గ్రామానికి ఇంటింటికీ మంచినీటి కొళాయి పదకం క్రింద నిధులు మంజూరు అయినట్లు మెట్టూరు సర్పంచ్ ఏర్లంకి ధర్మారావు తెలిపారు. ఈ పనులకు ఆయన శుక్రవారం పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఎంతో కాలంగా సోలిపి గిరిజనులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు బిందెడు నీళ్ళు కోసం కిలోమీటర్ పైన నడచి వెళ్ళేవారు ఇక్కడ నీళ్ళు కోసం మహిళలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే రెడ్డి శాంతి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేశారని సర్పంచ్ ఏర్లెంకి తెలిపారు.

# రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

**విశాలాంధ్ర-పలాస :** పలాస రైల్వేస్టేషన్‌లో వజ్రపుకొత్తూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మరడ పాపారావు శుక్రవారం రాత్రి రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతుండగా జారిపడి గాయపడ్డాడు. పలాస నుంచి భువనేశ్వర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనా జరిగిన వెంటనే 108 సిబ్బంది సత్యం, వెంకట్రావు ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కరువు మండలంగా ప్రకటించి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లండ వెంకటరావు

**విశాలాంధ్ర-మెళియాపుట్టి :** ఇటీవల గడిచిన కొంతకాలంగా వర్షాలు పడక, ప్రత్యామ్నాయ నీటి సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్న దృశ్య మెళియాపుట్టి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లండ వెంకట్రావు కోరుతున్నారు. ప్రస్తుత ఈ యేడాది వర్షాలు లేక పంటలు సరిగా పండక రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సివస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తునే, ఇటువంటి పరిస్థితుల్లో రైతులతో పాటు వ్యవసాయ కూలీలను, పేదలను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు, పేదలకు నెలకు 10 వేలు పెన్షన్ తో పాటు 35 కేజీల బియ్యం ఇవ్వాలని, పేద విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని, పేదల ఇళ్ళ కరెంటు బిల్లుల బకాయిలను రద్దు చెయ్యాలని, రైతులకు పంట నష్టంతో పాటు ఇచ్చిన పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, పశు గ్రాసం ఉచితంగా ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉపాధి హామీ పథకం నిధులు కేంద్రం నుంచి ఎక్కువ వచ్చేలా నివేదికలు తయారుచేసి గ్రామీణ ప్రాంతాలలోనున్న కూలీలను ఆదుకోవాలన్నారు. వలస వెళ్లిన వారిని తిరిగి రప్పించి ఉపాధి హామీ పనులతో స్థానికంగా ఉపాధి కల్పించేలా చేస్తూ 200 రోజుల పని దినాలు కల్పించి, కనీస వేతనం రోజుకు 600 వచ్చేలా చూడాలని, గ్రామీణ ప్రాంతాల్లో సాగు, తాగు నీటి పరిష్కారానికి నిధులు విడుదల చెయ్యాలని కోరారు. వలస వెళ్లిన కూలీల పిల్లలు, వృద్ధులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం మండలంలో గల మర్రిపాడు-కె సచివాలయ అధికారులకు అందజేశారు. అన్ని గ్రామ సచివాలయంల వద్ద ఈ నెల 25 నుంచి 29 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందించనున్నట్లు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 29వ తేదీ వరకు జరిగే నిరసన కార్యక్రమంలో సంఘ సభ్యులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ప్రకటనలో కోరారు.

# బలవర్ధక ఆహారంతో బాలలకు ఆరోగ్యం

**విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు:** బలవర్ధకమైన ఆహారం అందించడం ద్వారా బాలలు ఆరోగ్యవంతంగా ఉంటారని తహసీల్దార్ బి. అప్పలస్వామి అన్నారు. శుక్రవారం పెద్దబొడ్డపాడు సచివాలయం వద్ద ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ ను ఎంపీపీ ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావుతో కలిసి స్టాల్‌లో ఉంచిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అవసరం అన్నారు. శుచి, రుచికరమైన ఆహారం గర్భిణీలు, బాలింతలకు అందుతుంది అన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు వలన పిల్లల్లో పోషకవిలువలు పెరుగుతాయి అన్నారు. నాడు-నేడు కింద పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలోనూ మౌలిక వసతుల కల్పన జరుగుతుంది అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందిస్తున్న సమతుల్య ఆహారం క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనత సమస్యలు భవిష్యత్తులో తలెత్తవు అన్నారు. ఆటపాటలతో కూడిన విద్య వలన పిల్లలకు చదువుపై ఆసక్తి కలుగుతుంది అన్నారు. ఆటపాటలతో విద్యపై ఆసక్తి పెంచుకొనే వయసులో కాన్వెంట్ చదువులంటూ పిల్లలను పరోక్షంగా వత్తిడికి గురి చేస్తున్నారు అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించే బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తమ్మినాన ఢిల్లీరావు, కొల్లి భాస్కరరావు, ఎంపీటీసీ ఉరిటి కామేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ అప్పన్న, కార్యదర్శి ఈశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ గంగమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు హెచ్. చంద్రావతి, బమ్మిడి భాగ్యవతి, లండ మౌనిక, పద్మావతి, లత, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# విదేశాల్లో ఇరుక్కుపోయిన వారిని రప్పించండి

ఎంపీ రామ్మోహన్ నాయుడును కోరిన తెదేపా నేత రాజులు

**విశాలాంధ్ర-సంతబొమ్మాళి :** ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి ఇరుక్కుపోయిన సంతబొమ్మాళి మండలం పిత్తవానిపేట గ్రామస్తులు ముగ్గురిని, తిరిగి రప్పించాలని శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు, కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు, సంతబొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ నాయకుడు, పెట్టవానిపేట సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు పిట్ట రాజుల ఆధ్వర్యంలో, విదేశాల్లో ఉన్న వారి కుటుంబ సభ్యులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ ఏడాది ఆగస్టులో ఉపాధి కోసం ఉత్తర అమెరికా వెళ్లారని అక్కడ సరైన ఆహారం నీరు దొరక్క అనారోగ్యం పాలయ్యారని ప్రస్తుతం వారు చావు బతుకుల్లో ఉన్నారని వారి కుటుంబ సభ్యులతో పాటు రాజులు ఎంపీకి సమర్పించిన పత్రంలో పేర్కొన్నారు. ఎన్‌విసి ఏజెన్సీ ద్వారా వెళ్లి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారని, అక్కడ. మొసళ్ళు సైతం తిరుగుతూ ఉన్న సమయంలో ఎప్పుడు కాటు వేస్తాయో తెలియని పరిస్థితిలో ఉన్నారని వారిని తక్షణమే రక్షించాలని రప్పించాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఇక్కడి కి వచ్చేందుకు 80 వేల రుపాయలతో టిక్కెట్‌లు తీసుకున్నా, ఎయిర్ పోర్టులో అభ్యంతరం చెపుతున్నారు అని ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు తెలిపారు. వాటితోపాటు మాజీ ఎంపీటీసీ శ్రీరంగం ఎర్రయ్య, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

# రాష్టాభివృద్ధి ప్రగతి రధసారధిగా జగనన్నకే సాధ్యం : స్పీకర్

**విశాలాంధ్ర-పొందూరు :** రాష్టాభివృద్ధికి ప్రగతి రధసారధిగా జగనన్నకే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శుక్రవారం గొకర్ణపల్లి పంచాయతీ పరిధిలో పనులు పూర్తి చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గోకర్ణపల్లి గ్రామంలో సుమారు 40 లక్షల నిధులతో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో గోకర్ణపల్లి గ్రామంలో సిసి రోడ్డు రంగనాథ పేట గ్రామంలో కలువాలతో కూడిన సిసి రోడ్డు, సచివాలయం భవనానికి రక్షణ గోడ పనులు పూర్తి చేశారు. ఆ కార్యక్రమాలను ఈరోజు స్పీకర్ చేతులు మీదగా ప్రారంభించారు. సుమారు 65 లక్షల నిధులతో రంగనాథ్ పేట గ్రామంలో వాటర్ ట్యాంకు మరియు ఇంటింటికి మంచి నీటి కుళాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా సుమారు రెండు కోట్ల 65 లక్షల ఏఐఐబి నిధులతో కావలి ఆర్ అండ్ బి రోడ్డు నుండి వయా మున్సిబ్ పేట లచ్చయ్యపేట మీదగా తాడివలస వెళ్ళే నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును స్పీకర్ తమ్మినేని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్టు వివరించారు.ఎన్నికల మేనిఫెస్టోను సర్వమత గ్రంథాలుగా భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి పాలన పట్ల ప్రజల్లో విశ్వసనీయత చెక్కు చెదరలేదని పేర్కొన్నారు..గత మూడున్నర ఏళ్లలో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ అత్యుత్తమ నాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99శాతం అమలుచేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉరాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు,మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కోంచాడ రమన మూర్తి,మార్కెట్ కమిటీ అధ్యక్షులు బడాన సునిల్,రాష్ట్ర వాణిద్య విభాగ్ ప్రధాన కార్యదర్శి బండారు జై ప్రతాఫ్ కుమార్,పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు స్థానిక సర్పంచ్ చింతాడ మాధురి స్థానిక నాయకులు చింతాడ ప్రసాదరావు రాజశేఖర్ జీవరత్నం సీపాన రాజుల నాయుడు తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# వాండ్రాయిలో జగనన్న సురక్షా కార్యక్రమం

**విశాలాంధ్ర-సారవకోట/జలుమూరు :** మండలం వాండ్రాయి సచివాలయం పరిధిలో జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని వైసీపీ యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎవరూ ఎటువంటి అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో జగన్‌మోహన్‌రెడ్డి ఈ భృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వివరించారు. సురక్షా కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈయనతోపాటు వైసీపీ నాయకులు ఉన్నారు.

# కొండల ధర్మరాజు పరామర్శించిన సిరిపురం తేజేశ్వరరావు

**విశాలాంధ్ర-పాతపట్నం :** మండలం స్థానిక బ్రాహ్మణ వీదికి చెందిన కొండాల ధర్మరాజు ధన అనే అబ్బాయి (20) సంవత్సరాలు వయస్సు బుధవారం రాత్రి దాదాపు ఒంటిగంట సమయంలో దాబా పైనుంచి నిద్రమత్తులో కింద పడిపోయాడు. తలకు బలమైన గాయమై శ్రీకాకుళం బలగ జేమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతనిని, అతని కుటుంబ సభ్యులను సిరిపురం తేజేశ్వరరావు నేడు పరామర్శించారు.

## విద్యుత్ డీడర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి : సీఐటీయు డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు నెల వారీ కనీసవేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే.శివారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆర్.కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించి నెలవారి వేతనాలు అమలు చేయాలని కోరుతూ శ్రీకాకుళం పెద్దపాడు నుంచి విజయవాడ వరకు నిర్వహించబోతున్న బైక్ ర్యాలీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి తేజేశ్వరరావు పెద్దపాడు వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బైక్ ర్యాలీ సూర్య మహల్ మీదుగా ఏపీఈపీడీసీఎల్ సూపరింటెంట్ ఇంజనీరు వారి కార్యాలయంలో సామూహిక రాయబారం నిర్వహించి సూపరింటెంట్ ఇంజనీర్‌కి యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ ఉపాధికి ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని, అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న మీటర్ రీడర్స్‌ను సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్స్‌లో ఐటిఐ ఎలక్ట్రికల్ ట్రేడ్ డిప్లమోల ఉత్తీర్ణైన వారిని షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. నాన్ టెక్నికల్‌గా ఉన్న వారికి అర్హతను బట్టి విద్యుత్ సంస్థలను ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలవారి వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా నాయకులు జే.వేణుగోపాలరావు, పి.తులసీదాస్, డి.భాస్కర రావు, జి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## వాన దేవుడా... కరుణించు

- వర్షాలు లేక మెట్ట ప్రాంతంలో ఎండిన వందల ఎకరాలు
- మెట్టలో వర్షాలు లేక ఎండిన చెరువులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : దేశ సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడేది సైనికుడు అయితే ఆరుగాలం శ్రమించి దుక్కిదున్ని పార పట్టి అందరి ఆకలి తీర్చేది రైతన్న, అలాంటి రైతన్న గుండె నేడు బీడు అయ్యింది. ఆదరించే నాధుడు కోసం మెట్ట ప్రాంత రైతన్న ఎదురు చూస్తున్నాడు. రాత్రి చలి, పగలు భానుడి భగ భగ తో వర్షాలు పడక , చెరువుల్లో నీరు లేక, బావుల్లో బోర్లలో నీరు అట్టడుగున ఇంకి పోవడంతో అప్పు చేసి శ్రమ టోడ్చి పండించిన పంట ఎండంతో దిక్కుతోచని స్థితిలో బిక్కు బిక్కు మంటూ కంట నీరు కారుస్తున్నారు అన్న దాతలు. కోటబొమ్మాళి మండలంలో ఎక్కువ శాతం మెట్ట ప్రాంతం, ఈ యేడాదిలో వర్షాలు సకాలంలో పడక పోవడం వలన రైతులు అపార నష్టం వాటిల్లింది. వరి సాగు రైతులు. వర్షాభావం వలన చెరువుల్లో సైతం నీరు లేక పోవడం, బోర్లలో నీరు అట్టడుగుకు వెళ్లి పోవడంతో నష్టాల ఊబిలో

కూరుకు పోయాడు రైతన్న. కోటబొమ్మాళి మండల పరిధిలో కురుడు, దంత, రామయ్యపేట, సౌదాం, రేగులపాడు, ఊడికలపాడు, దుర్గంపేట తదితర గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో వరి పంట భానుడి ప్రతాపానికి ఎండిపోయింది. ఇంకో వారంలో వర్షాలు పడకపోతే పూర్తిస్థాయిలో రైతులకు అపారనష్టం జరుగుతుందని, పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు నష్ట పరిహారం రూ.50వేలు ఇవ్వాలని ప్రతిపక్షాల డిమాండ్ చేస్తున్నాయి. ఇలానే ఇంకో వారం ఉంటే మెట్ట ప్రాంతంలో వరి పంట అంతా ఎండిపోవడం ఖామని, అప్పులు చేసి మరీ వరి సాగు చేశామని, వర్షాలు లేకపోవడం వలన పంట అంతా ఎండిపోయిందని రైతులు అవేదన వ్యక్తం చేశారు. దీనిపై మెట్ట ప్రాంతం రైతులకు నష్ట పరిహారం ఇచ్చేలా చూస్తామని, వైసీపీ ప్రభుత్వం లో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదని మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. కోటబొమ్మాళి మండల పరిధిలో దెబ్బ తిన్న పంట వివరాలు క్షేత్ర స్థాయిలో సందర్శించి ఉన్నత అధికారులకు నివేదిక ఇప్పటికీ అందించాం అని, ఇంకో వారంలో వర్షాలు పడక పోతే పూర్తి స్థాయిలో వరి పంట అంతా ఎండిపోతుంది అని అన్నారు .రైతులకు నష్ట పరిహారం అనేది ప్రభుత్వ పరిధి అంశం అని అన్నారు. ఏది ఏమైనా అన్నం పెట్టే రైతన్నను కదు కష్టం రావడంతో యకరానికి యాభై వేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలి అని రైతు సంఘం, ప్రతి పక్షలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

పలాస ఆర్డీవో భరత్ నాయిక్

విశాలాంధ్ర-పలాస: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని, ఎన్నికల కమిషన్ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తుందని, దీనిని వినియోగించుకోవాలని పలాస ఆర్డీవో భరత్‌నాయిక్ అన్నారు. శుక్రవారం ఓటర్ల జాబితా విడుదల సందర్భంగా పలాస తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి నవంబరు 9వ తేదీ వరకు ఓటర్ల చేర్పులు, మార్పులతో పాటు కొత్త ఓటరును నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియ ప్రతి సచివాలయం పరిధిలో ఉందని తెలిపారు. అలాగే పోలింగ్ స్టేషన్ మార్పులు, ఫారం-6, 7 ద్వారా మార్చుకోవచ్చని, తుది జాబితా జనవరి 1వ తేదీ 2024లో విడుదల చేస్తామన్నారు. పొరపాటున బూతుల వారిగా తొలగించిన ఓట్లును వచ్చే నెల 9వ తేదీలోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటు నమోదు చేసుకోవచ్చని, ఈ సౌలభ్యం కేంద్ర ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఓటరు జాబితాలో రెండు ప్రాంతాల్లో ఓట్లు కలిగిన ఓటరు తన అభిప్రాయం మేరకే ఒకే చోట ఉండేందుకు అస్కారముందని, ఫారం-8 ద్వారా మిగిలిన ఓటును తొలగిస్తామన్నారు. పలాస నియోజకవర్గంలో 284 పోలింగ్ బూతులు ఉన్నాయని, అలాగే 2,12,252 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,04,612 మంది, స్త్రీలు 1,08,055 మంది, ట్రాన్స్‌జండర్స్ 35 మంది ఉన్నారని తెలిపారు. సమావేశంలో ఎన్నికల డి.టి రాంబాబు, పలాస, మందస, వజ్రపుకొత్తూరు

తహశీల్దార్లు మధుసూధనరావు, పాపారావు, అప్పలస్వామిలు పాల్గొన్నారు. అంతకు ముందు వివిధ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితా సవరణలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు భవానీ, పి.విఠల్, బద్ద నాగరాజు, సూరాడ మోహనరావు, కోన క్రిష్టారావు, శ్యామసుందర్, తంగుడు వీర్రాజులు పాల్గొన్నారు.

## విజయవాడ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-సోంపేట : నవంబర్ 15న విజయవాడలో జరుగుతున్న సిపిఎం భారీ బహిరంగ సభను అత్యధిక ప్రజానీకం పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు కె.మోహన రావు పిలుపునిచ్చారు. సోంపేటలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.లక్ష్మినారాయణ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో గోవిందరావు మాట్లాడుతూ లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 2 నుంచి బస్సు యాత్రలు ప్రారంభమవుతాయని అన్నారు. నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభతో బస్సుయాత్రలు ముగుస్తాయని అన్నారు. బిజెపి పాలనలో దేశం అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం దేశ సంపదనంతా అదానీ, అంబానీలకు దోచి పెడుతుందని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన పంట కాగుతున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి నాయకులు ప్రత్యేక హోదా గాని, పోలవరం జాతీయ ప్రాజెక్టు గాని, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామయ్యపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటి అమలు చేయలేదని అన్నారు. పాతిన కృష్ణమూర్తి, గున్న రామయ్య, కప్ప గోపినాథ్, కర్రి సింహాచలం, కృష్ణ, రఘు, రామయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌ను విమర్శించే స్థాయి మీకుందా..?

- మా ప్రభుత్వంలో అభివృద్ధి పనులు గూర్చి బహిరంగ చర్చకు మేము సిద్ధం.... మీరు సిద్ధమా....?

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: జర్జంగి - జగన్నాధపురం రోడ్ లో 0/0 నుండి 5/735 వరకు సుమారు రూ.2.20 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు టెండర్ వెలువడిన విషయం విధేయతమే. అయితే గురువారం శంకుస్థాపన చేయవలసి ఉండగా, కొన్ని అనివార్య కారణాలవల్ల వాయిదా వేయడం జరిగింది. ఈ విషయంపై టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివాల సూర్యనారాయణ చిత్రపటం లేదంటూ కార్యక్రమాలను వాయిదా వేసి ప్రజాదాన్ని వృధా చేయవద్దంటూ

చేసిన వ్యాఖ్యలకు, జిల్లా వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బద్దిన రామారావు తీవ్రంగా ఖండించారు. ఒక వ్యక్తిని విమర్శించేటప్పుడు మీ స్థాయి ఏంటో చూసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం లా శంకుస్థాపన చేసిన రాళ్లను ఉత్సవ విగ్రహాలుగా వదిలిపెట్టలేదని, ప్రజలలోకి వెళ్లి అడిగితే మా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు తెలుస్తాయని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుంటే పసుపు మీడియా చూడలేక ఇలా మాట్లాడుతుందని. మా ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనుల గురించి ప్రజా వేదికపై ఎక్కడైనా మాట్లాడడానికి, బహిరంగ చర్చకు మేము సిద్ధంగా ఉన్నాము..... మీరు సిద్ధంగా ఉన్నారా అంటూ సవాల్ విసిరారు. జగనన్న చేసిన అభివృద్ధి, జగనన్న అందించిన సంక్షేమ ఫలాలే మమ్మల్ని ఈరోజు ధైర్యంగా మాట్లాడిస్తున్నాయని అన్నారు.

## జిల్లా వైఎస్ఆర్సిపి కోశాధికారి లోతుగడ్డ తులసి వరప్రసాదరావు పర్యటన

విశాలాంధ్ర -హిరమండలం:శుక్రవారం పాతపట్నం నియోజకవర్గంలో వలువురు వైఎస్ఆర్సిపి నాయకుల్ని కార్యకర్తల్ని కలిసి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి వచ్చేలా కృషి చేయాలని జగన్మోహన్ రెడ్డి చేసిన సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజలందరికీ వివరించాలని అలాగే పాతపట్నంలో స్థానికంగా స్థానిక నాయకులందరూ కలిసి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. స్థానిక నాయకులందరూ కలిసి మూకుమ్మడిగా పనిచేసి ఈసారి స్థానిక నాయకత్వంలో వైఎస్ఆర్సిపి జెండా ఈసారి పాతపట్నం నియోజకవర్గంలో ఎగురుతుందని వైఎస్ఆర్ సీపీ నాయకులకు వైఎస్ఆర్సిపి జిల్లా కోశాధికారి లోతుగడ్డ తులసి వరప్రసాదరావు అన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ఉన్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు కార్యకర్తలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. శుక్రవారం హిరమండలం శుభలయి, ఆర్ అండ్ ఆర్ కాలనీ, గులుమూరు, పిండువాడ అంబవిల్లి, మొదలగు గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వైస్సార్సీపీ నాయకులు జిల్లా వ్యవసాయ సంఘం సలహా మాజీ

సభ్యులు కోయిలాపు సంజీవరావు, కొత్తూరు మండలం ఎంపీపీ ,ప్రతినిధి సవర రమేష్, వైసీపీ నాయకులు పల్ల రామకృష్ణ, చోడవరపు మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

## భవిష్యత్ గ్యారెంటీ తెలుగుదేశం పార్టీతోనే

- పార్లమెంట్ సభ్యులు రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర -టెక్కలి: భవిష్యత్తు గ్యారెంటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని సైకో పాలను అంతమందించాలంటే ప్రజలు ఓటనే ఆయుధంతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, భవిష్యత్తు తరాల కోసం ఆలోచించే నాయకుడు

ఎవరైనా ఉన్నారంటే చంద్రబాబు నాయుడు అని మన పోరాటం జగన్మోహన్ రెడ్డి మీద కాదని ప్రజల భవిష్యత్తు మీదని కార్యకర్తలు, నాయకులు నూతన ఉత్సాహంతో పనిచేసి చంద్రబాబు నాయుడుని అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత మనదేనని పార్లమెంట్ సభ్యులు రామ్మోహన్ నాయుడు కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని టెక్కలి మండలం లోని స్థానిక ఆదిత్య కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటి కార్యక్రమ అంశాలను కార్యకర్తలకు వివరించారు.పలాస నియోజకవర్గ ఇన్చార్జ్ గౌతు శిరిష మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లేదని, కొత్త పరిశ్రమల రాక ఉద్యోగాలు లేక,ఉద్యోగ అవకాశ కల్పన లేకుండా ప్రభుత్వ పరిపాలన ఉందని, ఆస్తులు ఉన్నాయని వాటి మీద ఆధారపడి బతుకుదాం అంటే వాటికి కూడా గ్యారెంటీ లేకుండా పోయిందని, సైకోపాలనాతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, తెలుగుదేశం అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి ని చేసుకుంటే రాష్ట్రం గాడిన పడుతుందని, మన పోరాటం అధికార పార్టీ మీద కాదని ప్రజల భవిష్యత్తు తరాల గురించని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్,మజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాదు, నాలుగు మండలాల తెదేపా అధ్యక్షులు,నియోజకవర్గం ముఖ్యనాయకులు, నియోజకవర్గం నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## సోషల్ అడిట్‌లో రికవరీలను చెల్లించండి

విజిలెన్స్ అధికారి లవరాజు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి: మండలంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరిగిన సామాజిక తనిఖీలలో వచ్చిన రికవరీలను వెంటనే చెల్లించాలని జిల్లా విజిలెన్స్ అధికారి బి. లవరాజు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయానికి అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వలు సూచనలు చేశారు. సామాజిక తనిఖీలలో చెల్లించాల్సి రికవరీలను వెంటనే చెల్లించాలని లేకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అలాగే మండలంలో రూఫ్‌టాప్‌హార్‌వెస్టింగ్ స్ట్రెక్చర్స్ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా సూపరెండెంట్ ఫణీగ్రహి, జీఈ జి. హరిప్రసాద్, క్లస్టర్ టీఏ రాంబాబు, పి. నర్సింహమూర్తి, సాంకేతిక సహాయకులు ఉన్నారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీపీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ప్రజల ఆరోగ్య పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోగల రేగులపాడు గ్రామ సచివాలయ అవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మారుతున్న ఆహారపు

అలవాట్లు, జీవన విధానం వల్ల ప్రజల్లో పలు రకాల రుగ్మతలు తలెత్తుఉన్నాయన్నారు. అందుకు తగినట్లుగానే వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిందని దీనిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రజలవద్దకే వైద్యం తీసుకు వచ్చారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యరాలు డాక్టర్లు డి. నీరజ, మనీష, ప్రీతి, జోత్న, సురేష్, నితీష్‌కుమార్‌లు 300 మంది పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిభిరం అవరణలో అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆర్. మధు, ఈవోపీఆర్‌డీ బొడ్డేపల్లి రామారావు, రాష్ట్ర కళింగ కర్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, నాయకుడు పేడాడ వెంకటరావు, దుంగ శిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డోర్ డెలివరీ స్టిక్కర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళం-2 డిపో గ్యారేజీ ఆవరణలో ఏ.విజయకుమార్ డీపీటీవో ఆధ్వర్యంలో డోర్ డెలివరీ స్టిక్కర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీ సంస్థ వారు 2021 లో ఈ డోర్ డెలివరీ విధానాన్ని ప్రారంభించడం జరిగినదనీ అప్పటి నుండి ఇప్పటి వరకు కస్టమర్లందరూ ఏపీఎస్ఆర్టీసీ డోర్ డెలివరీని ఆదరించారని అన్నారు. దీనిలో భాగంగా అక్టోబర్ 26 నుండి నవంబర్ 25 వరకు డోర్ డెలివరీ ప్రచార మహోత్సవ కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి చేరువవ్వాలని ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ప్రతి ఒక్క సిబ్బంది తమ స్నేహితులకు, బంధువులకు, చుట్టుపక్కల వారికి తెలియపరచి వారి ద్వారా ఈ డోర్ డెలివరీ కార్యక్రమాన్ని భాగస్వాములు చేయాలని తెలియజేశారు. ఈ డోర్ డెలివరీ అనేది ఎంపిక చేసిన 87 పట్టణములలో 10 కిలోమీటర్ల పరిధిలో 50 కేజీల బరువు వరకు డోర్ డెలివరీ చేయబడుతుందని, కావున ఈ అవకాశాన్ని కస్టమర్లు అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఏటీఎం కమర్షియల్ దివ్య, డిపో

## వైసీపీ ప్రభుత్వంలో ఉద్దాన ప్రాంతాభివృద్ధి

విశాలాంధ్ర-పలాస : వైసీపీ ప్రభుత్వంలో ఉద్దాన ప్రాంతాభివృద్ధి చెందిందని పలాస జెడ్‌పిటిసి ప్రతినిధి మచ్చ ధనరాజ్ అన్నారు. మండలంలో కొబ్బరిచెట్లూరు గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు 5.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేయనున్న సిసి రోడ్డుకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, ప్రతీ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం పథకం ద్వారా 20లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణ చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సొర పద్మావతి, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి సొర్ర తిరుపతి, ఎంపిటిసి కోరాడ నిరోషా, వైసీపీ నాయకులు కోరాడ ధనరాజ్, పాతిని జానకిరావు, తామాడ క్రాంతి, తామాడ మనోజ్, దుమ్ము ధర్మారావు, సొర్ర ధర్మారావు, నాతిని రామారావు, బొడ్డు నవీన్‌లు పాల్గొన్నారు.

## ఆరోగ్య సమాజ నిర్మాణమే లక్ష్యం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : ఆరోగ్యకర సమాజ నిర్మాణమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీపీ ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పెద్దబొడ్డపాడు సచివాలయం లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా వైద్య బృందాలు, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది వైద్య పరంగా పల్లెల్లో జల్లెడ పడుతున్నారు అన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుంది అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో అనేక వ్యాధులను చేర్చి ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరించడం జరిగింది అన్నారు. కార్పొరేట్ వైద్యం పేదల ముంగిటకు తీసుకొచ్చిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుంది అన్నారు. ఆరోగ్యకర సమాజంతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమాన్ని సమిష్టిగా ముందుకు తీసుకు వెళ్లాలని కోరారు. నిపుణులైన వైద్యులు రోగులకు సరైన సూచనలు సలహాలు ఇస్తున్నారని తెలిపారు. ప్రైవేటుగా వైద్యం కోసం డబ్బులు అనవసర ఖర్చు నిరోదించి ప్రభుత్వ వైద్యశాలలను పేదలు వినియోగించుకోవాలని కోరారు. ఈ శిబిరానికి 314 మంది రోగులు తరలిరాగా 15 మందికి వైద్యులు రెఫరల్ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ కనిష్క ఆధ్వర్యంలో వైద్య బృందం సేవలు అందించి అవసరమైన వారికి రిఫర్ చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు తమ్మినాన ఢిల్లీరావు, కొల్లి భాస్కరరావు, ఎంపీటీసి ఉరిటి కామేశ్వరరావు, మాజీ ఎంపీటీసి ఇప్పిలి అప్పన్న,తహసీల్దార్ బి. అప్పలస్వామి కార్యదర్శిలు ఈశ్వరరావు, దామోదర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## 29న జీ తెలుగు కుటుంబం అవార్డ్స్-2023

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ప్రారంభించిన రోజు నుంచీ ప్రతిభావంతులైన కళాకారులు, దర్శకులు, రచయితలు, నిర్మాతలు, చిత్రబృందం అంచంచలమైన అంకితభావంతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టడంలో జీతెలుగు తిరుగులేని ఎదుగుదల కొనసాగుతోందని ఆ ఛానెల్ ప్రతినిధి చెప్పారు. ప్రతిష్ఠాత్మక జీ తెలుగు కుటుంబ అవార్డులను ప్రదానం చేయడం ద్వారా అదే ఉత్సాహంతో ముందుకు సాగాలని నటీనటులను ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతి ఏటా వైభవంగా జరిగే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ వేడుక ఈసంవత్సరం మరింత ఘనంగా జరిగిందని, జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2023 వెండితెర, బుల్లితెర తారల తళుకులుతోఅత్యంత వైభవంగా సాగిన కుటుంబం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమ మొదటి భాగం అక్టోబర్ 29సాయంత్రం 6గంటలకు ప్రారంభం కానుందన్నారు. అద్భుతమైన ప్రదర్శనలతో వినోదంగా సాగే ఈ కార్యక్రమంలో అభిమాన నటులు ఏ అవార్డు గెలుచుకున్నారో తెలుసుకోవాలంటే మిస్ అవకుండా చూడాల్సిందేనని, అంగరంగ వైభవంగా సాగిన కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్ శ్యామల వ్యాఖ్యాతలుగా వ్యవహరించారని చెప్పారు.

## మాతృమూర్తి యువజన సేవా సంఘం సభ్యులకు ఘన సత్కారం

విశాలాంధ్ర-కవిటి: ఉద్దానం ప్రాంతంలో ఎంతో మంది నిరుపేదలకు అక్షయపాత్రగా మారి ఆకలితో అలమటించే నిరుపేదల పాలిట అమృత మూర్తి... మాతృమూర్తి యువజన సేవా సంఘం మనీ వక్తలు అన్నారు.ఈ మేరకు శుక్రవారం మండలంలోని కుసుంపురం గ్రామంలోని మాతృమూర్తి యువజన సేవా సంస్థ చేసిన సేవలకు గుర్తింపుగా బల్లిపుట్టుగ శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ కమిటీ,గ్రామ సర్పంచ్ ప్రతినిధి రజనీ కుమార్ దొళాయి చేతుల మీదుగా సంస్థ సభ్యులకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాతృమూర్తి యువజన సేవా సంఘం చేసిన సేవలకు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బల్లిపుట్టుగ గ్రామ పెద్దలు, గ్రామస్తులు, కమీటీ సభ్యులు,సంఘ సభ్యలు పాల్గొన్నారు.

## ఢిల్లీకి పయనమైన మేరా మట్టి... మేరా దేశం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నాదేశం.. నామట్టి కార్యక్రమంలో భాగంగా మండలంలో గల 38 పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని శుక్రవారం స్థానిక ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ చేతులు మీదుగా ఎత్తురాళ్ళపాడు ఉపాధిహామీ క్షేత్రసహాయకులు ఎన్. షన్ముఖరావు మట్టికుండను పట్టుకొని ఢిల్లికి వయనమయ్యాడు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, జేఈ జి. హరిప్రసాద్, తదితరులు ఉన్నారు.

## మహిళల అభ్యున్నతి కోసం వైసీపీ కృషి

విశాలాంధ్ర-పలాస : మహిళల అభ్యున్నతి కోసం వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తున్నదని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం పలాస కాశీబుగ్గ మున్సిపల్ మెప్మా ఆధ్వర్యంలో ఆర్.పిలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి ప్రభుత్వం మహిళా సాధికారిత కోసం కృషి చేస్తుందని, ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాసాధికారిత యాత్ర ప్రభుత్వం చేపడు తుందని, దానిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐ.బి.రాము, సి.ఎం.ఎం మోహన్, సి.హోలు స్వప్న, పద్మ, కవితలతో పాటు ఆర్.పిలు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-మందస: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, విజిలెన్సు అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని సొండిపూడి జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో "అవినీతి రహిత సమాజం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన సాయి గౌతమి (ప్రథమ బహుమతి), బాడ శ్రీకాంత్ (ద్వితీయ బహుమతి), వై.ఢిల్లీరావు (తృతీయ బహుమతి) బాడ శ్రీజా (కన్సిలేషన్ బహుమతి)లు ఇండియా డి.జి.ఎం ఎం.రామచంద్రన్, వి.శెట్టి, మేనేజర్ కె.రఘువతిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.అప్పారావు, నగిరి కరుణాకర్, ఎస్.నారాయణరావు, చంద్రశేఖర్, కె.వెంకట రమణ, ఆర్.చంటిబాబులు పాల్గొన్నారు.

## ఈక్రాప్ ముసాయిదా జాబితాలు ప్రదర్శన

విశాలాంధ్ర-సోంపేట : ఖరీఫ్ 2023 పంట కాలంలో వరి, కొబ్బరి, జీడి, మామిడి పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసుకున్న రైతు భరోసా కేంద్రం వద్ద సామాజిక తనిఖీ నిమిత్తం ముసాయిదా జాబితా ప్రదర్శించినట్లు మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తెలిపారు. ఈ మండలం రుషికుద్దలో పంట నమోదు జాబితాల తనిఖీ గ్రామసభలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కర్రి కామేశ్వరరావు, గ్రామసర్పంచ్ సంధి రాజు తదితరులు హాజరయ్యారు. పంట నమోదు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి, ధాన్యం కనీస మద్ధతు ధరకు ఈక్రాప్ నమోదు తప్పనిసరి అని పేర్కొన్నారు. నమోదులో ఏమైనా సవరణలు ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు రెల్ల హరీష్, గ్రామ రెవెన్యూ అధికారి ఢిల్లీరావు పాల్గొన్నారు.

## ఆరోగ్య సురక్ష అందరికీ రక్ష

ఎంపీపీ దాసు

విశాలాంధ్ర-సోంపేట : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలందరికీ రక్ష అని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. ఈ మండలం బెంకిలిలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలువురు ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యం అందుతుందని, 165 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వైద్య శిబిరాలను సందర్శించి వైద్య బృందాలతో మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను సందర్శించారు. ఆహార పదార్థాలను చూసి సంతృప్తి చెందారు. పంచాయతీ ప్రతినిధులతో పాటు ఎంపీడీఓ బి.వెంకటరమణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చలికాలం వచ్చేసింది..!

- శీతాకాలంలో పెరగనున్న జబ్బులు
- ప్రబలనున్న దగ్గు, జలుబు, సీజనల్ వ్యాధులు_ జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్లు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రతి సంవత్సరం ఋతువులు మారినప్పుడల్లా వాతావరణంలో మార్పులు వస్తూ ఉంటాయి. వానకాలం నుండి శీతాకాలానికి వాతావరణం మారితే ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ప్రతి ఏటా అక్టోబర్, నవంబర్ నుండి శీతాకాలం ప్రారంభమవుతుంది. ఈ శీతాకాలంలో ఎటువంటి అనారోగ్య సమస్యలు వస్తాయి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది అవగాహన అవసరం అని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం శీతాకాలంలో వాతావరణ ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. కోటబొమ్మాళి మండలం ఎక్కువగా కొండలు ఉండడం వల్ల చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో అయితే చాలా తక్కువ వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయి. దీంతో ప్రజల శరీర ఉష్ణోగ్రతకూడా బాగా తగ్గుతుంది. చలికాలంలో శరీరం చల్లగా ఉంటే గుండె జబ్బులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అంతేకాకుండా ఎక్కువగా ఈ చలికాలంలో జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులు కూడా వస్తాయి అని చలి తీవ్రతకు ఊపిరి తీసుకోవడం కూడా చాలా కష్టమవుతుంది వైద్యులు అంటు న్నారు. చలికాలంలో మెట్ట ప్రాంతంలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. దీని వలన అధిక శాతం రక్తపోటులో హెచ్చుతగ్గులు వస్తాయి. ప్రతి ఒక్కరూ శీతాకాలంలో గుండె జబ్బులు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ శీతాకాలంలో శరీరం వెచ్చగా ఉండే దుస్తులు ధరించాలి. వేడి వేడిగా ఉండే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. చెవిలో దూదులు పెట్టుకొని బయటికి వెళ్లాలని వైద్యులు పేర్కొంటున్నారు. చిన్నపిల్లలకు స్వెటర్లు వేసి బయటకు పంపించాలి. ఈ కాలంలో జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి వ్యాధి బారిన పడకుండా ఉండడం జరుగుతుంది. చల్లటి పదార్థాలు, తీపిపదార్థాలు, కూల్ డ్రింక్స్ వంటివాటికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి అంటున్నారు డాక్టర్లు. శరీర ఉష్ణోగ్రత పెంచేందుకు కాఫీ, టీ వంటివి తాగుతూ ఉండాలి. శరీరానికి వేడి చేసేటువంటి ఆహార పదార్థాలు కూడా తరచూ ఎక్కువగా తీసుకుంటూ వుండాలి.

# మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

పూర్తిస్థాయిలో హాజరుకాని సభ్యులు...

విశాలాంధ్ర-కవిటి: మూడు నెలలకోసారి ప్రజా సమస్యలు అభివృద్ధి నివేదికలు తదితర అంశాలపై చర్చించే సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించి ముగించేశారు. శుక్రవారం కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడియాల పద్మా ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశం గంట వ్యవధి నిర్వహించి అధికారుల నివేదికలు పూర్తి కాకుండానే ముగించేశారు. విద్యాశాఖ, ఎన్ఆర్ఈజీఎస్, వైద్య ఆరోగ్యశాఖ,రెవెన్యూ శాఖ, ఉద్యానవన శాఖ,హౌసింగ్ తదితర శాఖలు తమ తమ నివేదికలు చదివుతున్న సమయంలో ప్రజా ప్రతినిధులు బాతాకానిలో మునిగితేలారు. విద్యాశాఖ నివేదిక చదువుతున్న మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి చదువుతున్న సమయంలో కవిటి ఎంపీటీసీ పూడి నీలాచలం మాట్లాడుతూ మండల కేంద్రమైన కవిటిలో ఒడియా జడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్తి సిదిలావస్థకు చేరుకొని పక్కనే ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రోజులు గడుపుతున్నారని ఒడియా జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పాఠశాల నిర్మాణానికి సహకరించాలని కోరారు. వైస్ ఎంపీపీ పూడి నేతాజీ మాట్లాడుతూ సిలగాం పంచాయతీలో సీతకొండ లో బాంబులు మోతతో పరిసర ప్రాంతాల భూమి కంపించి పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఈ సమస్యపై గత సాధారణ సర్వసభ్య సమావేశంలో చర్చించడం జరిగిందని నేటికీ సమస్య పరిష్కర%శీ% కాలేదని సత్వరమే సమస్య పరిష్కరించాలని ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ తో కలిసి నేతాజీ కోరారు. ఆప్కారి శాఖ అధికారి తన నివేదిక చదువుతున్న సమయంలో పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు మాట్లాడుతూ మాణిక్యపురం పంచాయతీ పరిధిలో అబ్కారీ శాఖ అధికారుల అంటూ గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దాడులు చేపట్టి వెళ్తూ ఉంటారని దీనిపై వివరించాలని అబ్కారీ శాఖ అధికారిని కోరారు.అనంతరం మిగిలిన శాఖల అధికారుల నివేదికలు చదివి వినిపించకుండానే సమావేశాన్ని ముగించేశారు.గురువారం ఇచ్ఛాపురంలో జరిగిన సామాజిక సాధికారిక బస్సు యాత్ర ప్రారంభోత్సవ అభినందన సభకు ప్రజా ప్రతినిధులు అందరూ పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు,సీడ్ అఫ్ చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి,ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సాధికార బస్సు యాత్రకు అనూహ్య స్పందన : ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-పాతపట్నం: వైఎస్ఆర్సిపి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సాధికార బస్ యాత్రకు ప్రజల నుండి అనూహ స్పందన లభిస్తోందని ఇచ్ఛాపురంలో జరిగిన బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని సీఎం జగనన్న పాలన వల్లే సామాజిక న్యాయం సాధ్యమైందని పాతపట్నం శాసన సభ్యురాలు రెడ్డి శాంతి తెలియజేశారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో జరిగిన సామాజిక న్యాయాన్ని, పాటిస్తూ పేదవాడి విజయానికి బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వమని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు కల్పించిన ప్రాధాన్యత.. ఈ దేశ, రాష్ట్ర చరిత్రలోనే ఎవరూ చేయలేదని అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రతీ సామాజికవర్గానికి అండగా నిలుస్తున్నారన్నారు. మన ప్రభుత్వంలో. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రగతిని ఒక హక్కుగా మన ప్రభుత్వం వారికి అందించిందన్నారు. 53 నెలల కాలంలో రూ. 2.38 లక్షల కోట్ల డీబీటీలో 75శాతం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఈ వర్గాలకు చేరడమే దీనికి నిదర్శనమన్నారు. చట్టం చేసి నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఈ వర్గాలకు ఇస్తూ పట్టం కట్టిన ప్రభుత్వం కూడా మనదేనన్నారు. పెత్తందారీ పోకడలున్న వ్యక్తులు, శక్తులు అడుగడుగునా అడ్డుపడ్డా ఎక్కడా వెనకడుగు వేయలేదని, మహిళలకు ఆర్థికంగా ఆదుకుంటూ కుల మతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని గత చంద్రబాబు ప్రభుత్వంలో ఏ పథకం కావాలన్న తెలుగుదేశం నాయకుల చుట్టు చెప్పులు అరిగేలా తిరిగినా ప్రజలకు సంక్షేమ పథకాలు అందే కావని అనాటి జన్మభూమి కమిటీలు సిపార్సులు చేసిన వాళ్ళకి ప్రభుత్వ పథకాలు వచ్చేవి తప్ప సామాన్యులకు అందే కావని, కానీ ఈ ప్రభుత్వంలో ఎవ్వరి గుమ్మాలు చుట్టూ తిరగాల్సిన పనిలేదని వాళ్ళ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి వాలంటీర్ ఏ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నారని ఇది ఈ ప్రభుత్వం యొక్క గొప్పదనం అని అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఉద్దానం కిడ్నీవ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశాం రూ. 700 కోట్లతో ఉపరితల జలాలు వంశధార నుంచి పైపు లైన్ల ద్వారా త్రాగునీరు అందిస్తూ అందులో భాగంగానే పాతపట్నం నియోజక వర్గంలో ఉన్న ఐదు మండలాలకు నీటిని అందించేందుకు 267 కోట్లతో సాగు,త్రాగు నీటి ఏర్పాటు చేశామన్నారు. అవినీతికి, వివక్షకు తావులేకుండా ఈ నాలుగేళ్లలో బీసీ కుటుంబాలకు జగనన్న అందించిన సాయం మొత్తం అక్షరాలా రూ.1.62 లక్షల కోట్లు."ఇదీ సామాజిక సాధికారత అంటే"ఇవన్ని చంద్రబాబు పాలనలో చుసామా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మన శ్రీకాకుళం జిల్లాకు ఏమీ చేశారని నిలదీశారు. అందుకే టిడిపి నాయకులకు మన జిల్లా గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్ లో 23 సంస్థలు కేంద్రం ఇస్తే, ఒక్కటి కూడా మన జిల్లాలో ఏర్పాటు చేయలేదని అన్నారు.

# పాత ఓటరు జాబితా యధాతథంగా ఉంది

**సవరణలు చేర్పులు మార్పులు లేవు : టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట**

విశాలాంధ్ర-కొత్తూరు : నెలరోజులు బియల్వోలు ఇంటింటికీ తిరిగారు మృతుల పేర్లు తొలగించలేదు ఒకే దగ్గర కుటుంబం మొత్తం ఓటు ఉన్నవారు పేర్లు ఉండాలన్నా ఎన్నికల కమిషన్ నిందందనాలు అమలు కాలేదు అని పాతపట్నం నియోజిక వర్గ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ విమర్శించారు శుక్రవారం ఇక్కడ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కమాటలో చెప్పాలంటే పాత ఓటరు జాబితాను యధాతథంగా ముద్రించి రాజకీయ పార్టీ లకు అధికారులు ఇచ్చారు ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయి అని మాజీ ఎమ్మెల్యే కలమట అరోపనులుచేసారు ఈ తెప్పొప్పలను అధికారులు సవరించి ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా కొత్తగా ఓటరు జాబితాలు తయారు చేసి రాజకీయ పార్టీ ల కు ప్రజలకు అందుబాటు లో ఉంచా లని మాజీ. ఎమ్మెల్యే కలమట అన్నారు. ఈ మీడియా సమావేశం లో టిడిపి నాయకులు లోతుగెడ్డ భగవాన్ నాయుడు , గండివలస తేజేశ్వర్ రావు తదతరులు పాల్గొన్నారు

# ఏ.టి.యం మోడల్ క్షేత్ర స్థాయి సందర్శన

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం కేశవరావుపేట గ్రామం లో ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయల్లో ఏ.టి.యం మోడల్ పద్దతిలో సాగు చేస్తున్న ప్రకృతి సేద్య రైతు గున్నంనాయుడు క్షేత్రాన్ని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో మోడల్ పద్ధతిలో కూరగాయల సాగు చేసుకోవాలని తెలిపారు. అలాగే పలు పంటలు కూరగాయల సాగు వలన రైతులకి నిత్యం అదనపు ఆదాయం వస్తుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం లో పనిచేస్తున్న గున్నంనాయుడు తను సొంత పొలం లో ముప్పైసెంట్ల విస్తీర్ణం లో ఏ.టి.యం మోడల్ నీ సాగు చేస్తున్నారని అన్నారు. ఇందులో అన్ని రకాల కూరగాయల పంటలను పండిస్తున్నారని అలాగే దీనిలో ఇప్పటి వరకు ఆకుకూరల్లో అధిక ఆదాయం ఆర్జించినట్లు తెలిపారు. ఈ విధంగా రైతులు తక్కువ విస్తీర్ణం లో ఎక్కువ ఆదాయం పొందేలా మోడల్స్ పద్ధతులను క్షేత్ర స్థాయిలో ప్రోత్సహిస్తున్నామనీ తెలిపారు. ఈ కార్యక్రమం లో మాస్టర్ ట్రైనర్ లక్ష్మనాయుడు పాల్గొన్నారు.

# 'విజయ' సంకేతం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పార్టీ హైకమాండ్ నిర్ణయంతో గురువారం ఉత్తరాంధ్రలో ప్రారంభించిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం అయ్యిందని వై.సి.పి నియోజకవర్గ ఇన్ఛార్జి పిరియా సాయిరాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో పార్టీ సమావేశాన్ని నిర్వహించుకున్నారు. మున్సిపల్ చెయిర్పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రావు, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్ప్రసాద్లతో కలిసి నిర్వహించిన సమావేశంలో పార్టీ క్యేడర్కు సాయిరాజ్ కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. అన్ని స్థాయిలో పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేయడం వల్లనే ఒక మహత్తర కార్యక్రమం విజయవంతం అయ్యిందని అన్నారు. జగన్ పై నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేసిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. ఒక ముఖ్యమంత్రి సభకు వచ్చేంత జనం ప్రారంభోత్సవ సభను విజయవంతం చేయాడనాకి అన్ని ప్రాంతాల నుండి స్వచ్ఛందంగానే వచ్చారని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఖచ్చితంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగురవేస్తామనే ఉత్సాహంతో కార్యకర్తలు కన్పించి 'విజయ'సంకేతాలను అందించారని అన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు నాలుగు మండలాల ఎమ్పీపీలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల గొంతుకోస్తున్న పెత్తందారు జగన్ రెడ్డి

విశాలాంధ్ర-అరసవల్లి: నా ఎస్సీ, నా ఎస్టీ, నా బి సి అంటూ నయవంచన చేసి సమాజిక బస్సు యాత్ర చేయడం సిగ్గు చేటని, సామజిక న్యాయనికి శిలువ వేసిన నియంత జగన్ రెడ్డి. లక్ష బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం నమ్మక ద్రోహమేనని టీడీపీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక 80అడుగుల రోడ్డులో గల జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, 14 లక్షల ఎకరాల అస్సైన్డ్ భూములు, చర్చి భూములు వక్ఫ్ భూములు కబ్జా చేశారని ఆరోపించారు. ప్రజలకు నాసిరకం మద్యం పోసి, 30 వేల మంది ప్రాణాలు తీసి వారి భార్యల మంగళసూత్రాలు మంట కలిపారన్నారు. 120 టీడీపీ సంక్షేమ పథకాలు రద్దు చేసిన ఘనత కూడా జగన్ కె దక్కుతుందన్నారు. అన్నా క్యాంటీన్ లు, పెళ్లి కానుకలు, పండుగ కానుకలు, విదేశీ విద్య, నిరుద్యోగ భృతి, రుణమాఫీ లాంటి చంద్రన్న పథకాలు రద్దు చేసిన పేదల ద్రోహి జగన్. మైనారిటీలను మోసం చేసిన ఘనత వైకాపాదేనని, చంద్రన్న భీమా నీరు గార్చి కోటి 30 లక్షల మంది అసంఘటితుల భద్రతను దెబ్బ తీసారన్నారు. ఉత్తరాంధ్ర బి సీల్ని పుంగనూరులో చొక్కాలు విప్పి కొట్టారు. వీటన్నిటికీ భారీ మూల్యం జగన్ చెల్లించుకోక తప్పదని టీడీపీ హెచ్చరిస్తుందని ఈ సందర్భంగా పోస్టర్లను శ్రీకాకుళం పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు పి. ఎం. జె. బాబు, రైతు విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, పట్టణ అధ్యక్షులు మధారపు వెంకటేష్, ఎస్ సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఐటీడీపి జిల్లా అధ్యక్షులు ప్రధాన విజయరాం, పట్టణ మహిళా నాయకురాలు కావాడి సుశీల, కరగాన రాము సురకాశి వెంకట్రావు తదితరులు పాల్గొని ఆవిష్కరించారు.

# నిరుపేదలకు జనసైనికుల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని కొత్తపాలెం గ్రామ జనసైనికులు ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని 16 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టారు.ఈ మేరకు శుక్రవారం కొత్తపాలెం గ్రామానికి చెందిన 16 మంది నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి ఒక రైస్బ్యాగ్తో పాటు (సరుకులతో కూడిన కిట్టు) ఇచ్ఛాపురం జనసేనపార్టీ ఇంఛార్జి దాసరి రాజు చేతుల మీదుగా నిత్యావసర సరుకులను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం జనసేన ఇన్చార్జ్ దాసరి రాజు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అడుగు జాడల్లో నడుస్తూ సామాన్యులను ఆదుకొనే మంచి కార్యక్రమాలు చేస్తున్న జనసైనికులకు అభినందనలు తెలిపారు. అలాగే పవన్ కళ్యాణ్ జనసైనికుల కుటుంబాలకు బరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో క్రియాశీలక సభ్యత్వం అనే కార్యక్రమాన్ని మొదలు పెట్టారని ప్రమాదవశాత్తూ చనిపోయిన జనసైనికులకి ప్రమాద భీమా 5 లక్షలు రూపాయలు అందజేస్తారని అన్నారు. అలాగే 2024 లో రాబోయేది జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సమక్షంలో దాసరి రాజు కి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వర్ రావు,జనసేన రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా,జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దుగాన దివాకర్, కుసుంపురం సర్పంచ్ అభ్యర్థి అంగ సురేష్,ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 10వ వార్డ్ ఇంఛార్జి రోకళ్ళ భాస్కర్,బడే రాజు, హేమా చలపతి, రాజశేఖర్, ధనుంజయం, రవి, రామ్మూర్తి,జోగారావు,ప్రేమ్ కుమార్, గ్రామపెద్దలు, మహిళలు,యువత పాల్గొన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి వైద్యమందించడమే జగనన్న సురక్ష లక్ష్యం

విశాలాంధ్ర-కవిటి: ప్రతి పేద కుటుంబానికి వైద్యం అందించడమే జగనన్న సురక్షమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నెలవంక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ రామారావు పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ పేదవాడు డబ్బులేక వైద్యానికి దూరంగా ఉండకూడదని ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆంధ్రప్రదేశ్ లో ప్రతి కుటుంబం ఇంటి వద్దకే నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో సీడప్ చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మండలంలోని నెలవంక గ్రామంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ చేతుల మీదుగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ప్రారంభోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాన్ని పూర్తిగా మ్యాపింగ్ చేసి,ప్రతి గ్రామంలోనూ,ప్రతి ఇంటినీ, జల్లెడ పట్టి,ఏ ఇంట్లో ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా ఆ ఇంటి దగ్గరే 7 రకాల పరీక్షలు చేసి వారికి వైద్య సేవలు అందించేటట్టుగా రూపొందించిన ఈ కార్యక్రమం ప్రజారోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి సూర్యనారాయణ రెడ్డి,తాసిల్దార్ పి శేఖర్,స్థానిక సర్పంచ్ గౌతమీ కుమార్ మోహన్ రెడ్డి,ఎంపీటీసీ సభ్యులు దుక్క దూడమ్మా,రైతు భరోసా అధ్యక్షులు దువ్వ కృష్ణ రెడ్డి,వైద్య సిబ్బంది సచివాలయ సిబ్బంది వాలంటీర్లు అంగన్వాడీ కార్యకర్తలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ నామాలు (ఏపీ) గ్రంథ బహూకరణ

విశాలాంధ్ర-పొందూరు: ప్రముఖ నామ విజ్ఞాన వేత్త, వాంద్రంగి కొండలరావు రాసిన 'గ్రామనామాలు (ఆంధ్రప్రదేశ్)' గ్రంథాన్ని ఇక్కడి ఎస్.బి.ఐ చీఫ్ మేనేజర్ (ముఖ్య ప్రబంధకులు) సి.హెచ్.ప్రసాదరావుకు శుక్రవారం బహూకరించారు. 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో "ఊరు-పేరు(ఆంధ్రప్రదేశ్)అనే పుస్తకాన్ని కొండలరావు రాశారు. ఈ పుస్తక ప్రతులలో కొన్నింటిని కోల్ కత్తా లోని రాజారాం మోహన్ రాయ్ ఫౌండేషన్ కొనుగోలు చేసి ప్రోత్సాహించింది.ఈ గ్రంథం ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక ప్రాంతాల్లోని తెలుగు పాఠకుల ఆదరణ పొందింది.కాగా 2016 మార్చి 19న విశాఖపట్నం లో ఆవిర్భవించిన ఉత్తరాంధ్ర తెలుగు రచయితల వేదికపై "వ్యక్తి నామ విజ్ఞానం"పై సమగ్ర పత్రాన్ని సమర్పించారు."ఊరు-పేరు(ఆంధ్రప్రదేశ్) పుస్తకానికి సంబంధించి ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో కొండలరావు సుదీర్ఘ ప్రసంగం చేశారు.అలాగే ఈ పుస్తకంపై ప్రముఖ కథారచయిత సర్వసిద్ధి హనుమంతరావు ఇదే కేంద్రంలో సమీక్ష నిర్వహించారు.కాగా "గ్రామనామాలు" పుస్తకంపై ప్రముఖ యూట్యూబ్ చానెల్ ఎస్.కె.మోటివేటర్స్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది.మరో ముఖ్య విషయమేమిటంటే విశాఖ సంస్కృతి మాసపత్రిక గత అయిదేళ్ల నుంచి ప్రతి నెలా ధారావాహికంగా" ఊరు-పేరు" శీర్షికతో అయన కొత్తగా రాస్తున్న గ్రామనామాలు గురించి ప్రచురిస్తూ ప్రోత్సాహిస్తోంది. సమకాలీనంలో రాష్ట్ర స్థాయిలో గ్రామనామాలు అంశంపై విశేష కృషి చేస్తున్న రచయిత కొండలరావును ఎస్.బి.ఐ ముఖ్య ప్రబంధకులు ప్రసాదరావు అభినందించారు.

# గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలి

- రాష్ట్ర కార్యదర్శి ఎర్రదేవుడు డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా కల్లుగీత వృత్తిని ఆధునీకరించి గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రదేముడు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం రూరల్ ఒప్పంగి సొసైటీ పరిధిలో జరిగిన గీత కార్మికులు జిల్లా 5వ మహాసభలో.మాట్లాడారు. కల్లుగీత కార్పొరేషన్ కు రూ.5వేలు కోట్లు నిధులు కేటాయించి గీత కార్మికులు సంక్షేమం కోసం పనిచేయాలని డిమాండ్ చేశారు. రకరకాల మద్యం బ్రాండ్లు ఉన్నట్లుగా ప్రకృతి ప్రసాదం అయినా కల్లు కు బ్రాండ్ కేటాయించి గీతవృత్తిని పరిశ్రమగా గుర్తించాలని అన్నారు. నాడు పాదయాత్రలో కల్లు గీత కార్మికులకు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక కల్లు గీత కార్మికులను పక్క కు నెట్టేయడం దౌర్భాగ్యమని అన్నారు. పక్క రాష్ట్రాల్లో గీత వృత్తిని కాపాడుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రమాదానికి గురైన ప్రతి కార్మికునికి 10 లక్షలు ఎక్స్గ్రేషియో ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డిపి దేవ్ మాట్లాడుతూ పురాతనమైన గీత వృత్తిపై ఆధారపడిన కుటుంబాలును ఆదుకోవడానికి ప్రభుత్వం ద్వారా పరిష్కరించుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గీత వృత్తిపై కొంత అవగాహన కలిగి ఉన్నట్లు చెప్పారు. గీత వృత్తిపై మరింత అధ్యయనం చేసి గీత కార్మికులకు ఉపాధి కలిగించే ప్రయత్నం ప్రభుత్వం ద్వారా కల్పించుటకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శిమ్మ అప్పారావు, సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బ కోటేశ్వరరావు, ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గొర్ల ఎర్రయ్య, సరిపల్లి వెంకటరమణ, బంటుపల్లి సత్యనారాయణ, పెంటిమాని వేణుగోపాల్, అలిగి గోదావరి, వివిధ సొసైటీ నుంచి 300 మంది గీత కార్మికులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం

నియోజకవర్గ ఇన్చార్జ్ దువ్వాడ వాణి

విశాలాంధ్ర-టెక్కలి: గ్రామాల అభివృద్ధే వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమని గ్రామాల అభివృద్ధిలో పనులు జరిగినప్పుడు తగిన అంచనా వేసి బిల్లులు మంజూరు చేయాలని, బిల్లులు మంజూరు చేయడంలో కమిషన్లకు కక్కుర్తి పడొద్దని నియోజకవర్గ ఇన్చార్జ్, సమన్వయకర్త ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ వాణి అన్నారు. శుక్రవారం ఎంపీపీ అట్ల సరోజినమ్మ అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో అమె ముఖ్యఅతి థిగా హాజరయ్యారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ అన్ని గ్రామాలు అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నర్సింగపల్లి పంచాయతీ పరిధిలో తమకు తెలియకుండా నిధులు మంజూరు చేయడం బిల్లులు చెల్లించడం పై ఆమె మండల ఇంజనీర్ శాఖ జెఈ ఎన్ఎల్ నాయుడు పై మండిపడ్డారు. అన్ని ప్రాంతాలు కు సమానంగా జనరల్ ఫండ్ కేటాయించ వలసిందిగా అధికారులకు సూచించారు. ముఖలింగాపురం సర్పంచ్, ఎంపీటీసీకి తెలియకుండా ఎస్టీ నిధులు 2.5 లక్షల నిధులతో కంకర రోడ్డు వేయడంపై సర్పంచ్ బంద పల్లి రాకేష్,ఎంపి టీసి లు ప్రశ్నించారు. చిన్న బజార్లోని ఇరుకు రోడ్డులో గత ప్రభుత్వం కాలువను ఆక్రమించి కట్టిన షెడ్డు ను తొలగించి రోడ్డు వెడల్పు చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని, చేపల మార్కెట్ లోని సముదాయ భవనాలు ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం సూచించారు. ప్రతి పంచాయతీలో కమ్యూనిటీ భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీపీ అట్ల సరోజినమ్మ పేర్కొన్నారు. అంతకుముందు కార్యాలయ ఏవో మూర్తి 2023-2024 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు తదితర వివరాలు 2024-2025వ సంవత్సరం యొక్క అంచనా బడ్జెట్ అజెండా చదివి వినిపిం చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ హెచ్.ఆర్. ఎన్. మూర్తి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# పంట నమోదుపై అభ్యంతరాలుంటే తెలియజేయండి : ఏవో

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: పంట నమోదుపై అభ్యంతరాలుంటే తెలియజేసి సరి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం. ఉషాకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని కిల్లిపాలెం, ఖాజీపేట రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్-2023 సీజనుకు సంబంధించి పంట నమోదు జాబితాలు, సామాజిక తనిఖీ నిమితం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 24 రైతు భరోసా కేంద్రాల్లో జాబితాలను ప్రదర్శించడం జరిగిందన్నారు. అలాగే గ్రామ సభలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో 10669 మంది రైతులను 14770 ఎకరాల్లో వివిధ పంటలను ఈకెవైసీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ రెండు రోజులు గ్రామ సభలు నిర్వహించి జాబితాలో ఏమైనా మార్పులు ఉంటే వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈనెల 29వ తేదీలోపు సరిచేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జె. ఎరుకు నాయుడు, కిల్లిపాలెం రైతులు రెడ్డి రాజారామ్, చంద్ర శేఖర్, ఖాజీపేట రైతు గోలివి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.